క్లుప్తంగా

మానసిక వికలాంగుల పట్ల ప్రేమతో మెలగాలి


మానసిక వికలాంగులకు స్నాక్స్ అందజేస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): మానసిక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో మెలగాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ గురువారం ప్రపంచ మానసిక విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక తంగేళ్లమూడిలోని మిషనరీ ఆఫ్ చారిటీ నిర్వహిస్తోన్న హోమ్‌ను ఆయన సందర్శించారు. ఈ హోమ్‌లో అందుతున్న సదుపాయలపై ఆరా తీశారు. న్యాయ సమస్యలపై ఉచిత న్యాయ సాయం అందిస్తామని తెలిపారు. హోంలోని మానసిక వికలాంగులకు స్నాక్స్‌ను ఆయన స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు సంస్థ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య



ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య తెలిపారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన మాలతి బదిలీ అవ్వడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ విధులను సైతం తానే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, టూటౌన్‌లో తాను పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కలిపి మొత్తం 958 మంది శానిటేషన్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వీరిలో 148 మంది పర్మినెంట్, 13 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, మిగిలినవారు ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చంద్రయ్య పేర్కొన్నారు.

ధ(స)రా ఘాతం

- పండుగవేళ నిత్యావసర, కూరగాయల ధరలకు రెక్కలు
- కొరవడిన నియంత్రణ
- ప్రజల గగ్గోలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దసరా పండుగకు తెలుగు ప్రజల్లో ఒక ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు వారు భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగల్లో దసరా ఒకటి. సంక్రాంతి పండుగలానే దసరా పండుగకూ సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు తమ తల్లిదండ్రులను చూడడానికి, విద్యా సంస్థలకు వారానికి పైగా సెలవులిచ్చే ఈ పండుగను పురస్కరించుకుని సొంత ప్రాంతాలకు వస్తుంటారు. అయితే ఈ పండుగకు వచ్చే చుట్టాలకు పంచభక్ష్య పరమాన్నాలు కాకపోయినా కనీసం కూరగాయల భోజనం పెట్టాలన్నా వెనుకాడే పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రోజురోజుకీ పెరిగిపోతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలే కారణం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కేజీ రూ.20ల్లో ఉన్న కూరగాయల ధరలు ప్రస్తుతం రూ.60ల్లోకి ఎగబాకాయి. ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చుక్కల వైపు ధరల చూపు

నగరంలో ఏ కూరగాయ ధర చూసినా బహిరంగ మార్కెట్‌లో రూ.50కు పైగానే ఉంది. రైతు బజారుల్లో సైతం వివిధ కూరగాయల ధరలు చుక్కల వైపే చూస్తున్నాయి. రైతు బజారులో కేజీ వంకాయలు రూ.50, టమాటాలు రూ.60, బీరకాయలు రూ.54, చిక్కుడుకాయలు రూ.60కు విక్రయిస్తుండగా, బయటి మార్కెట్‌లో వాటి ధర ఒక్కో రకంపై రూ.10 అదనంగా వేసుకోవాలి. బీన్స్, క్యాప్సికమ్ వంటివి కావాలంటే రూ.100కు పైనే చెల్లించాలి. అల్లం ధర రూ.150, ఉల్లిపాయలు రూ.55, దోసకాయలు రూ.40, ఆనబకాయ రూ.40, కంద రూ.50 ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు అన్ని కూరగాయల ధరలూ చుక్కల వైపే చూస్తున్నాయి.

దళారుల అక్రమాలకు అడ్డేదీ

అధికారులు, ప్రజాప్రతినిధులు దళారులకు కొమ్ము కాస్తూ వారి అక్రమాలకు గేట్లు ఎత్తివేశారా అంటూ ప్రజలు వాపోతున్నారు. నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో తెలియడం లేదని, ఇదంతా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరుగూ ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వ ఉంచే గొడౌన్లపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిన దాఖలాలు కూడా కనిపించడం లేదని, వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారెమోననే సందేహం లేకపోలేదు. ఇటీవల వంట నూనెల డిస్ట్రిబ్యూటర్లు, హోల్‌సేల్ వ్యాపారాలపై నామమాత్రపు దాడులు చేసి అధికారులు మమ అనిపించారని, ఇది కేవలం కంటి తుడుపు చర్య మాత్రమే పలువురు విమర్శిస్తున్నారు. వారి నిర్లిప్తత కారణంగానే బియ్యం కిలో రూ.75, చింతపండు కిలో రూ.150, వెల్లుల్లి రూ.380, బెల్లం రూ.100, పామాయిల్ రూ.125 ఇలా రెక్కలు కట్టుకుని పైకి ఎగురుతూనే ఉన్నాయి. వీటి ధరలను నియంత్రించడానికి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి హెచ్చరికలు జారీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.


రైతు బజారులో కూరగాయలు

మనవలకు ఏమి వండి పెట్టాలి



దసరా సెలవులకు ఇంటికి వచ్చిన మనవలకు ఏమి వండి పెట్టాలో తెలియడం లేదు. మాలాంటి సామాన్య కుటుంబాలకు ప్రస్తుతం ఉన్న ధరలు పెద్ద దెబ్బనే చెప్పాలి. ఏ కూరగాయ చూసినా రూ.60కు పైగానే చెబుతున్నారు. కనీసం పండుగకు పరమాన్నం వండాలన్నా బెల్లం ధర అందుబాటులో లేకపోయింది.

– అన్నం తులసమ్మ, గృహిణి

సంపద సృష్టి ఎవరికి



సీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానంటే పేదల కోసమేమో అని ఆనందపడ్డాం. తీరా చూస్తే దళారులు, వ్యాపారులు ధరలు పెంచుకునే అవకాశం ఇచ్చినట్టున్నారు. ఈ ధరలతో కేవలం గంజిమాత్రమే తాగగలం. పండుగ పూట మాలాంటి పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక బహుమతి ఈ ధరలే అనుకుంటా.

– జి.మంగ సూర్యకాంతం, గృహిణి

అగ్గిపుల్లపై రతన్ టాటా


అగ్గిపుల్లపై చెక్కిన రతన్ టాటా చిత్రం

ఏలూరు (టూటౌన్): సూక్ష్మ కళతో దిగ్గజ పారిశ్రామిక వేత్త దివంగత రతన్ టాటాకు తనదైన శైలిలో నివాళులర్పించారు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. అగ్గిపుల్లపై చాక్‌పీస్‌తో రతన్ టాటా ఆకృతిని రూపొందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబును పలువురు అభినందిస్తున్నారు.

రతన్ టాటా మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): ప్రముఖ వ్యాపార వేత్త రతన్ టాటా మృతి దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. విలువలతో కూడిన వ్యాపారంతో రతన్ టాటా ఒక పెద్ద బ్రాండ్‌ను సృష్టించారని కొనియాడారు. తన ఆదాయంలో 60 నుంచి 65 శాతం వరకు వివిధ దాతృత్వ కార్యక్రమాలకు ఉదారంగా దానం చేసి ప్రజల హృదయాలలో సుస్థిరంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కేవలం రూ.1 లక్ష కే నానో కారును అందజేశారని తెలిపారు.

• వెండి మబ్బులు


నీలాకాశంలో వెండి మబ్బులు కనువిందు చేశాయి. ఏలూరు నగరంపై గురువారం మధ్యాహ్నం ఈ రమణీయ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ దృశ్యం నగరవాసులను ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

పండుగ వేళ.. ప్రయాణికుల పాట్లు

- నెల రోజుల వరకు రిజర్వయిన టిక్కెట్లు
- ప్రత్యేక రైళ్లను నడపడంలో అధికారులు విఫలం


కిక్కిరిసి పోయిప్రయాణిస్తున్న ప్రయాణికులు


స్టేషన్‌లో దిగేందుకు సైతం అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ఏలూరు (టూటౌన్): దసరా, దీపావళి పండుగలకు దూరప్రాంతాల్లో ఉండే వారంతా తమ సొంత ఊర్లకు వచ్చేందుకు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. పండుగల రద్దీకి అనుగుణంగా రైల్వే అధికారులు తగినంత ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నెల రోజుల వరకు రైళ్లలో సీట్లన్నీ రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయి. అవసరం మేరకు ప్రత్యేక రైళ్లను నడపడంలోనూ అధికారులు విఫలమయ్యారు. దీంతో పండుగలకు స్వగ్రామాలకు వద్దామనుకున్న వారికి దిక్కుతోచని పరిస్థితులు ఎదురయ్యాయి. ఎక్కువ మంది ప్రైవేట్ ట్రావెల్ బస్సులనే ఆశ్రయించాల్సిన వస్తోంది.

ఛార్జీల మోత

హైదరాబాద్ నుంచి రైలులో రిజర్వేషన్‌తో రూ.300 నుంచి రూ.400లకే ఏలూరుకు వచ్చే ప్రయాణికులు బస్సుల్లో నాలుగు నుంచి ఐదు రెట్లు ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఏలూరు, రాజమహేంద్రవరం, తుని, అనకాపల్లి, విశాఖ పట్టణం, విజయనగరం, శ్రీకాకుళం వరకు వేల సంఖ్యలో ప్రయాణికులు పండుగ రోజుల్లో ప్రయాణిస్తుంటారు. వీరంతా నెల రోజుల ముందు నుంచే రిజర్వేషన్లు చేయించుకుని తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు సమాయత్తమవుతుంటారు. అయితే 15 రోజుల ముందు నుంచే హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వైపు వచ్చే రైళ్లు అన్నింటిలో రిజర్వేషన్లు ఫుల్ అవడంతో పండుగలకు సొంత ఊర్లకు వద్దామనుకున్న వారికి ఏం చేయాలో పాలిపోవడంలేదు.

ఏలూరు ప్రాంత వాసులు 5 వేలకు పైమాటే

దసరా, దీపావళి పండుగలకు తమ సొంత ఊర్లకు వచ్చే వారు ఒక్క ఏలూరు, దాని పరిసర ప్రాంతాల వారే దాదాపు 5 వేల మందికి పైగా ఉంటారు. వీరందరూ అధికంగా రైళ్లల్లోనే ప్రయాణిస్తుంటారు. అయితే ప్రస్తుతం రిజర్వేషన్లు లేకపోవడం తత్కాల్ టిక్కెట్‌లు ఓపెన్ చేసిన కొద్ది సేపటికే ఆన్‌లైన్‌లో బుక్ అయిపోవడంతో పండుగకు తమ ఊర్లకు ఎలా వెళ్లాలని తల పట్టుకుంటున్నారు.

రెండే ప్రత్యేక రైళ్లు

దసరా పండుగ రద్దీ పేరుతో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు కేవలం రెండే ప్రత్యేక రైళ్లను ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు నడుపుతోంది. వీటి గురించి ప్రయాణీకులకు పూర్తిస్థాయిలో సమాచారం లేకపోయినప్పటికీ ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా టిక్కెట్‌లు ముందుగానే బుక్ చేసేసుకుంటున్నారు. మరోవైపు ఆన్‌లైన్ బుకింగ్ సెంటర్‌ల నిర్వాహకులు రద్దీని ముందేపసిగట్టి టిక్కెట్‌లను వారే ముందుగా బుక్ చేసేసి ఆ తర్వాత అధిక రేట్లకు టిక్కెట్లను విక్రయిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. మొత్తంగా రైల్వే శాఖ అధికారులు పండుగ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడపడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాడులకు భయపడొద్దు


పార్టీ జిల్లా అధ్యక్షులు డీఎన్నార్‌ను కలిసిన లీలానవకాంతం గంగరాజు

దెందులూరు : కూటమి ప్రభుత్వ నాయకులు, అనుచరులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు వేధింపులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడవద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు సూచించారు. గురువారం ఆయన్ని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పార్టీ నేత నిట్టా గంగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. తమను, తమ కుటుంబాలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని అభివృద్ధికి సంబంధించి శిలాఫలకాలు ఛిద్రం చేశారని జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకే కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని డీఎన్నార్ ఆరోపించారు. ఏకంగా దేవుడు ప్రసాదంపై తప్పుడు సమాచారాన్ని ఇవ్వడంపై త్వరలోనే ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు.

పెంచిన జీతాలు ఇప్పించండి

భీమడోలు: ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలు పెంచుతూ ఇచ్చిన జీఓను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ కె.అనూరాధను కంప్యూటర్ ఆపరేటర్ల వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు. గురువారం ఏలూరులోని డీపీవో కార్యాలయంలో డీపీఓ అనురాధను సొసైటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బీఎస్ దుర్గారావు, కోశాధికారి కె.లావణ్య, కార్యదర్శులు డి.ఆదిత్య, ఎస్.వల్లిబాబా, జి.ధర్మతేజ కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ-పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు జీతాలను రూ.15 వేల నుంచి రూ.18,500లకు పెంచుతూ పంచాయతీ రాజ్ కమీషనర్ ఉత్వర్వులు జారీ చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలలో 233 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారని తెలిపారు. 3 నెలలు గడుస్తున్నా నేటికి ఉత్తర్వులు అమలు చేయలేదని వాపోయారు. డీపీవో సానుకూలంగా స్పందించారని వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

ఏలూరులో ఆటోలతో ర్యాలీ

సమస్యలపై కలెక్టర్, ఎస్పీలకు వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పట్టణం, రూరల్ ఆటో కార్మికులకు, హనుమాన్ జంక్షన్ అప్పనవీడు ఆటో కార్మికులకు మధ్య వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సమస్యలపై కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు పట్టణం, రూరల్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు లీలా కృష్ణ, గౌరవ అధ్యక్షుడు గూడవల్లి శ్రీనివాసలు మాట్లాడారు. ఏలూరు పట్టణం, రూరల్ ఆటో కార్మికులు 5000 మంది ఏలూరు నగరం నుంచి అనేక ప్రాంతాలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కార్మికులుగా పనిచేస్తున్నట్టు చెప్పారు. హనుమాన్ జంక్షన్ అప్పన్న వీడు నుంచి ఏలూరు వచ్చే ఏలూరు నగర ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఏలూరు నగరంలోని మెయిన్ బజార్, కర్ర వంతెన, బిర్లభవన్ సెంటర్, రైతు బజార్, వసంత మహాల్, ఫైర్ స్టేషన్, జూట్ మిల్, కొత్త బస్టాండ్ మీదుగా వారికి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సక్రమంగా లేదని చెప్పారు. ఐనా ఏలూరు ఆటో కార్మికులపై దుశ్చర్యలకు పాల్పడడం సరికాదని అన్నారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల మధ్య వచ్చే వివాదాల పరిష్కారానికి కార్మిక సంఘాలు ప్రయత్నించాలని సూచించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వివాదాల పరిష్కారానికి ప్రయత్నం చేయాలే తప్ప అధికారులకు ఫిర్యాదులు చేసి కార్మికులను రెచ్చగొట్టే ఆలోచనకి వెళ్లవద్దని వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఏలూరు బస్టాండ్‌లో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు కొతబస్టాండ్‌లో ఒక వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం మండలం పాతూరు గ్రామం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి సమీప ప్రాంతంలో నివసించే రెంకిరెడ్డి శ్రీనివాస చక్రవర్తి అలియాస్ చిన్న (45) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతునికి వివాహం కాలేదని, అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈనెల 9న ఏలూరు కొత్తబస్టాండ్‌కు వచ్చాడు. బస్టాండ్‌లోని 15వ నెంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలోని ఐరన్ బెంచీపై కూర్చుని మృతిచెందాడు. గురువారం ఉదయం సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50-60	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36-50	ములక్కాడలు	07,10
బెండకాయలు	38	కంద	50
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్	40
కాకర కాయలు	34-44	కీరా దోస	36
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70-150
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40-48	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	35-55	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	36-40	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు


మహాదుర్గా దేవిగా పవర్‌పేట రాజ్యలక్ష్మి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవస్వామి ఆలయంలోని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి శ్రీ మహాదుర్గాదేవి అలంకరణ చేశారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మ సేవలో జేపీ దంపతులు

ఏలూరు రూరల్ : ఏలూరు దక్షిణపువీధి జలాపరమేశ్వరిదేవి (పెద్దమ్మ) ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్ సతీసమేతంగా పెద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు అందరూ సుఖంగా ఉండాలని అమ్మవార్ని కోరుకున్నట్టు జేపీ తెలిపారు. అనంతరం 15వ డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము, ఈఓ పీవీ కృష్ణంరాజు ఆయనకు ప్రసాదం,అమ్మవారి చిత్రపటం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.


అలేఖ్యమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వస్తున్న మహిళలు


జలాపరమేశ్వరిదేవిని దర్శించుకున్న జేపీ దంపతులు

అలేఖ్యమ్మకు నైవేద్యం

సాక్షి ఫొటో గ్రాఫర్, ఏలూరు : దేవీ నవరాత్రుల సందర్భంగా ఏలూరు కొత్తపేటలోని అలేఖ్యమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించడానికి మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా వచ్చారు. చిన్నా పెద్దా అందరూ కలిసి డప్పు కళాకారులతో వీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నగరంలోని దసరా మహోత్సవాలు సందర్భంగా ఆలయాలు విద్యుత్ కాంతుల్లో దగదగా మెరుస్తున్నాయి.